

# ప్రియమిత్ర

ప్రియమైన రాధకు,

నువ్వు రాసిన ఉత్తరం అందింది. నువ్వు రాలేకపోయినందుకు చింతిస్తూ ఉత్తరంలోనే నామీద సానుభూతి వర్షం కురిపించావు థాంక్స్, నిజం చెప్పాలంటే ఈనెలరోజుల నుంచీ నాకు ఇలాంటి సానుభూతి ఉత్తరాలు కుప్పలు తిప్పలుగా వచ్చిపడుతున్నాయి. తెలియనివాళ్ళు, తెలిసినవాళ్ళు అందరూ నామీద సానుభూతి చూపేవారే. నా దుఃఖంలో పాలు పంచుకునేవారే కానీ నీ ఉత్తరం ఇచ్చినంత వూరటను నాకు ఇంకే ఉత్తరమూ ఇవ్వలేదంటే నమ్ము. అయినా నువ్వు ఇదివరకు రాసినంత విరివిగా ఉత్తరాలు రాయడం లేదు. ఎందుకని ? నీకూ నాలాగే అడ్డంకులున్నాయా ? మనం ఒకరినొకరు కలుసుకుని ఎన్నో ఏళ్ళయిపోయాయి. కలుసుకోకపోతే మానె కనీసం ఉత్తరాలద్వారా నన్నా- ఒకరినొకరు పలకరించుకోకపోతే ఎలా చెప్పు ! నేను క్రితంసారి రాసినట్టు కేవలం ఒక్కగంటసేపటికైనా మీ వూరు రావాలని నా మనసు ఒక్కోసారి మరీ ఉబలాటపడిపోతుంది. మనసువిప్పి మాట్లాడుకోడానికి ఓ గంట సరిపోదంటావా ? సరే ఆ మాట ఇప్పుడెందుకు

జె. సుబ్బలక్ష్మి

గానీ- ఈ ఉత్తరంలోనైనా ఇప్పుడు నామనసు కాస్తవిప్పుకోనీ....

మావారు పోయి నెలదాటినా ఇంకా నన్ను పరామర్శించ టానికి వచ్చేవాళ్ళ సంఖ్య తగ్గలేదు. అవునుమరి ! ఆయన అంత పెద్దరచయితకదా ! ఓవైపు కాలేజీలో లెక్చరర్ ఉద్యోగంచేస్తూ మరోవైపు సాహిత్యసేవ కూడా చేస్తున్నవారయ్యే ! కాలేజీ స్టూడెంట్సు, సాత్రికేయులు, పబ్లిషర్లు, ఆయన అభిమానులు- ఇలా ఎవరో ఒకరురోజూ వస్తూనేవున్నారు. వచ్చిన ప్రతీవారూ ఆయన్ని పొగిడేవారే. ఆయన మంచితనం, ఆయనలో దాగి ఉన్న విజ్ఞాన సంపద, దానగుణం, ఉన్నత సంస్కారం, రచనాశక్తి- వీటన్నటి గురించీ ఏకరువు పెట్టి అంతటి మహానుభావుణ్ని పోగొట్టుకున్నం దుకు విచారించేవారే. ఆయన ఆత్మకుశాంతి కోరుతూ, ఆయన మరణంతో దేశం ఒకగొప్ప రచయితని పోగొట్టు-కున్నట్టయిందని వాపోయేవారే. మా మీద బోలెడంత సానుభూతి చూపి ఇంతటి దుఃఖాన్ని తట్టుకునేశక్తిని మాకు ప్రసాదించమని కనపడని ఆ దేవుణ్ని ప్రార్థించేవారే !


నిజం చెప్పనా రాధా....ప్రతీరోజూ తెల్లారి లేచిన దగ్గరి నుంచీ ఇవే మాటలు వినీవినీ విసుగెత్తిపోయిందనుకో. ఒక్కోసారి వారందర్నీ మాట్లాడ నీయకుండా ఆపిగట్టిగా అరిచి అడగాల నిపిస్తుంది. ఏమని ! "నిజంగా మీకంటికి ఆయనంటే అంత ఇష్ట మయితే మరి ఆయన బతికుండగా ఎప్పుడూ మా ఇంటికి రాలేదేం ?" అని కానీ దానివల్ల నాకు 'సంస్కారం తెలీనిమనిషి' అన్నపేరు రావడం తప్పమరే ప్రయోజనమూ ఉండదని తెలుసు.

కాబట్టి వాళ్ళు చెప్పేమాటలన్నీ వింటూ- వాళ్ళముందు దుఃఖం నటిస్తూ మౌనంగా కూర్చుంటున్నాను. వాళ్ళు చూపే గౌరవం, సానుభూతి అంతా ఒట్టి బూటకం అని తెలుసు. అసలు వాళ్ళకు ఇంతటి అవసరం ఇప్పుడేమొచ్చిందని ? ఇల్లు వెదుక్కుంటూ వచ్చి నాముందు తమ విచారమంతా వెళ్ళబోసుకోవాలని రూలేమైనా ఉందేమిటి ? మనుషులు ఇలా అబద్ధపు ముసుగులో ఎందుకు బతుకుతారో నా కర్థంకాదు.... అరె ! నేనూ ఓ అబద్ధపు ముసుగు దాటునే ఇన్నాళ్లూ బతికానుకదూ? ఆ సంగతి మరిచిపోయి అందర్నీ విమర్శించాను చూశావా ? బహుశా మనుషుల తత్వమే ఇంత కాబోలు !

"ఇంతకీ అబద్ధపు ముసుగు తొడుక్కోవలసిన అవసరం నీకేమిటి ?" అని నువ్వు ప్రశ్నిస్తావు అవునా ? చెబుతాను విను. పైకి చూడ్డానికి నా అంత అదృష్టవంతురాలు ఇంకెవరూ లేరేమో. నన్నంత సుఖంగా కనిపిస్తుంది మా సంసారం. జీవితంలో పొంద వలసినవన్నీ పొంది. తృప్తిగా, ఆనందంగా కాలం గడుపుతున్న గృహిణిలా కనిపిస్తాను నేను అందరికీ అవునుమరి.... పెద్దపేరున్న రచయిత భార్యని కదా ! "ఇద్దరు పిల్లలు, అత్తామామ, మరుదులు ఆడబడుచులు- అందరూ ఉన్న నిండుకుటుంబం ఈవిడికింకేం తక్కువ ?" అని అందరూ అనుకోవడంలో తప్పేముంది చెప్పు ? అలా అనుకునే నాకులేని విలువలన్నీ అంటగడుతున్నారు పత్రికల వాళ్ళిప్పుడు. క్రితంవారం ఒక పత్రికారచయిత మా ఇంటికి వచ్చి, మావారి ఫోటోలూ, మా కుటుంబసభ్యుల ఫోటోలూ. మా జీవిత

విశేషాలూ కావాలని అడిగాడు, మావారి గురించీ, మావారి సాహిత్య సేవ గురించీ ఫోటోలతో సహా ఓ వ్యాసం ప్రచురిందాలట. ఆయన నాగురించి ఎంతగొప్పగా అంచనా వేసుకున్నాడనుకున్నావు? "నిజం చెప్పాలంటే ఆయన అంత గొప్పరచయిత కావడానికి మీరే కారణం. మీ సహకారం లభించకపోయినట్టయితే ఆయన అంత మంచిరచనలు చేయగలిగేవారు కాదు. ఇంటి బాధ్యతలన్నీ మీరు నెత్తిన వేసుకుని ఆయనకు కావలసినంత తీరికనూ, ప్రశాంతతనూ అయనకు అన్ని విధాలూ తోడ్పడ్డారు. అసలు నన్నడిగితె ఆయన కొచ్చిన పేరు, లభించిన బిరుదుల్లో సగం భాగం మీకూ చెందాలి. కాబట్టి మీ గురించి కూడా కొన్ని వివరాలు చెప్పండి రాసు కుంటాను..." అని ఇంకా ఏమేమో అన్నాడనుకో !

అంతావిని నాలోనేను పేలవంగా నవ్వుకున్నానంతె! అసలు నన్ను అలా పొగడొద్దనీ, నేను ఒకనాటకంలోని పాత్రధారిగా ఒక బాధ్యతగల గృహిణి, వాత్సల్యంగల తల్లి పాత్రలను నిర్వహించానే గానీ మనస్ఫూర్తిగా ఇందులో నేను చేసిందేమీలేదు. ఇప్పుడు ఆ నాటకానికి తెరపడిపోయింది కాబట్టి ఇకనుంచైనా నటించడం మానేసి మిగిలిన శేషజీవితాన్ని నా కోసం నేను గడపాలనివుంది. "అని చెప్పేయాలన్నంత ఆవేశం వచ్చింది ఆ సమయంలో", కానీ ఎలాగో తమాయించుకున్నాను. ఎందుకంటే అసలే అతను పత్రికా రచయిత. ఏకాస్త నోరు జారినా అదంతా పత్రికలకెక్కి కూర్చుంటుంది మరి.




అసలు పైకి కనిపించే నేను- నేనుకాదనీ, నా పెదాలమీద కనిపించే నవ్వు నిజమైన నవ్వుకాదనీ- ఇంతవరకూ నేను ఎవరికి చెప్పలేదు. ఇప్పుడు కూడా ప్రాణస్నేహితురాలివిగనుక నీకొక్క దానికి తప్ప మరెవరికి నా విషయాలు తెలియటం నాకిష్టం లేదు.

రాధా....ఓ విషయం చెప్పనా ?

నాలో ఇన్నాళ్ళుగా ఉన్న ఓర్పు ఇప్పుడు లేదు. నా మనసు ఏ విషయాన్నీ వినిసహించి వూరుకోవడంలేదిప్పుడు. కళ్ళుండీ చూడలేని నోరుండీ మాట్లాడలేని ఆపరిస్థితి ఇప్పుడు మారిపోయింది ఇప్పుడు నేను సర్వస్వతంత్రురాలిని. ఎవరికి అణిగిమణిగి పడివుండ వలసిన అవసరం నాకు లేదు. నా మాటలు నీకు ఆశ్చర్యం కలిగి


స్తున్నాయి కదూ ? నిజమే వేరే ఎవరిముందైనా నేనిలా మాట్లాడితే నన్ను తప్పకుండా పిచ్చిదాన్నిగా జమకడతారు. కానీ ఎవరేమనుకున్నా నాకేం ఫరవాలేదు. నేనా మాటల్ని లెక్క చేయను. నాకు ఆత్మలగురించి ఎలాంటి నమ్మకంలేదు. మనిషి ఒకసారి చనిపోయాడందే ఇక అంతే- అతని కథ ముగిసిపోయినట్టే లెక్క నా దృష్టిలో. అందులోనూ మావారి విషయంలో మరీనూ. ఎందుకంటే ఆయనకు తన జీవితం, తన సాహిత్యప్రపంచం తప్పమరోటి అక్కర్లేకపోయింది. పొరపాటున ఎవరైనా ఆయన లోకంలోకి ప్రవేశించినా నిర్దాక్షిణ్యంగా వాళ్ళను అవతలికి వెళ్ళగొట్టి తనదారిలోతాను సాగిపోయేవారు. కన్నవాళ్ళుకానీ, కట్టుకున్న పెళ్ళాంకానీ, తన పిల్లలుకానీ- ఎవరూ అయన జోలికి వెళ్ళకూడదు. ఆయనదే ఓ ప్రత్యేకమైన ప్రపంచం !

అలా అని ఇంట్లోవాళ్ళకు స్వతంత్రం అంటే అదీలేదు. ఆయన మాట జవదాటకూడదు. ఒట్టికోపిష్టి. ఏ క్షణంలో ఏం ముంచుకొస్తుందో అన్నట్టు అందరూ ఎప్పుడూ ప్రాణాలుగుప్పిట్లో పెట్టుకుని బతికేవాళ్ళం. తన కథల్లోనూ, నవలల్లోనూ స్త్రీని కుసుమ కోమలిగానూ, ఉన్నత వ్యక్తిత్వంగలసబలగానూ, సున్నితమనస్కురాలిగానూ చిత్రించే మనిషి తన భార్యవిషయంలో మాత్రం ఎందుకంత కఠినంగా ప్రవర్తించేవారో నాకిప్పటికీ అర్థంకాదు. ఆయన ఊహల్లోని కథానాయకులకు భార్య దేవతలాంటిదైతే స్వయంగా ఆయనకుమాత్రం భార్య ఒక బానిస ఆయన కోరినట్టు నడుచుకునే ఒక యంత్రం. ఈ విచిత్రాన్ని ఎక్కడైనా చూశావా నువ్వు ?

నా జీవితం ఇలా కావడానికి కారణం ఎవరనుకొన్నావు ? నేనే ! నేనే ఏరి కోరి ఎంచుకున్న జీవితం ఇది, స్వయంకృతాపరాధం. కనుకనే ఇన్నాళ్లూ నోరుమూసుకునిభరించాను. పెద్దవాళ్ళు కుదిర్చిన సంబంధమైతే బహుశా నా ఉక్రోషమంతా వాళ్ళమీద చూపివుండేదాన్నేమో కానీ వాళ్ళు వద్దంటున్నా వినకుండా నేనే నా భర్తని ఎన్నుకున్నాను కాబట్టి ఈ తప్పును ఎవరి మీదానెట్టే అవకాశం నాకసలే లేదు.

"అవునూ....ఆసలు ఆయన నీకెలా తారసపడ్డాడు ?" అని నువ్వు ప్రశ్నిస్తావు నాకు తెలుసు. చెబుతాను విను. "త్రిమూర్తి"






అన్న కలంపేరుతో రాజారావుగారు రాసే కథలూ, నవలలూ తెగ చదివేదాన్ని నేను. ఆయన రచనలంటే నాకు మహాపిచ్చి. అలా ఆరంభమైన నా పఠనాసక్తి ఆ తరువాత అభిమానంగా మారింది. ప్రతి రచన చదివినప్పుడూ విధిగా ఉత్తరాలు రాయడం అలవాటు చేసుకున్నాను. ముందుముందు కేవలం ఆయన రచనల గురించే ఉత్తరాలు రాసేదాన్ని. కానీ ఆ తరువాత నాకే తెలియకుండా నా మనసులోని భావాలన్నీ ఆ ఉత్తరంలో వ్యక్తం కాసాగాయి. ఆయన్నుంచి నాకు ప్రేమ సందేశం ఏదీ రాకపోయినా నా మనసు మాత్రం పిచ్చి ఆరాధనలో పడిపోయింది. చివరికి పెళ్ళిచేసుకుంటే ఆయన్నే చేసుకోవాలి అన్న నిర్ణయానికి వచ్చేశాను. అందుకే ఇంట్లోవాళ్ళు నా కోసం సంబంధాలు చూస్తున్నారని తెలియగానే ధైర్యంచేసి నా మనసులో మాట వాళ్ళకు చెప్పాను. మొదట్లో వాళ్ళు విరోధించారు. తొందరపడి నిర్ణయం తీసుకోవడం మంచిది కాదని హిత బోధచేశారు. అప్పటికీ వినకపోతే బతిమాలారు. అయినా నేను నాపట్టు విడవలేదు. "అంతటి గొప్ప రచయితని పెళ్ళాడటంకంటే ఈ జన్మకు ఇంకేం అదృష్టం ఉంటుంది ? అని వాళ్ళనోళ్ళు మూయించాను.


ఇక లాభంలేదని తెలుసుకున్న మా నాన్న రాజారావుగారి ఇంటికి వెళ్ళి వాళ్ళ పెద్దవాళ్ళతో సంప్రదింపులు మొదలెట్టారు. మా వంశం, సంప్రదాయం అన్నీ వాళ్ళకూ నచ్చడంతో పెళ్ళికి వాళ్ళు సులభంగానే అంగీకరించారు. పెళ్ళి జరిగిపోయింది. ఇక ఆరోజు నా సంతోషానికి అంతే లేకపోయింది. మంచి సంస్కారం గల ఈ ఇంటికి కోడలిగా వస్తున్నందుకు ఎంతో గర్వించాను. మంచిమంచి పుస్తకాలు చదవొచ్చనీ, ఎంతో జ్ఞానం సంపాదించుకోవచ్చనీ ఆశపడ్డాను.

కానీ ఈ ఇంట్లోకి అడుగుపెట్టిన మర్నాడే నా ఆశలన్నీ అడియాసలైపోయాయి. నేను ఊహించుకున్న సుందర స్వప్నమంతా కరిగిపోయింది. కట్టుకున్న గాలిమేడలన్నీ కూలిపోయాయి. ఎందుకంటావా ? ఆడవాళ్ళు పుస్తకాలు పట్టుకుని మగవాళ్ళతో సమానంగా ముందుగదిలో కూర్చోవడం ఆ ఇంటి సంప్రదాయానికే విరుద్ధమట ! పెళ్ళయిన ఆడది గుట్టుగా వంటింట్లో పడివుండడమే

వాళ్ళ ఆచారమట !

తన రచనల్లో స్త్రీలను ఎంతో అభ్యుదయ భావాలు కలవారుగానూ, ఆదర్శమహిళలుగానూ చిత్రించే రచయిత ఇంట్లోని స్త్రీల గతి ఇది. దీనివల్ల నా మనసుకు కలిగిన ఆఘాతాన్ని తట్టుకోడానికి కొన్ని నెలలే పట్టాయి నాకు. నేనూ నలుగురున్న ఇంట్లో పుట్టి పెరిగినదాన్నే కాబట్టి ఇంటిపనులు చేయడం నాకేమీ కొత్తకాదు. ఎటొచ్చీ ఆడది పూర్తిగా ఇంటిపనులకే అంకితమైపోవాలి అన్న వాళ్ళ అభిప్రాయమే నాకు సుతరామూ నచ్చలేదు. మా అత్తగారి సంగతి వదిలెయ్...ఆవిడ పాతకాలపు మనిషి అని మనసు సరిపెట్టుకోవచ్చు. కానీ మా ఆయన సంగతేమిటి ? ఒక కాలేజీ లెక్చరర్, అభ్యుదయ భావాలుగల రచయిత- అంత సంకుచితంగా ఆలోచించడం అనేది మరీ ఘోరంకాదూ ? రోజంతా ఇంటి చాకరీ, ఇంట్లోవాళ్ళ బాగోగులు చూడడం, ఆయనకు ఎప్పుడేది కావాలంటే అది అందించడం- వీటితోనే కాలం గడిచిపోయేది.


పొద్దున్న పొయ్యి మీదికెక్కిన కాఫీ తప్పాలాను మళ్ళీ కిందికిదించడం రాత్రి పడుకోబోయేముందే. బయటనుంచి ఎప్పుడు ఆర్డరు వస్తే అప్పుడు అన్నికిప్పులూ వెంటనే అందించాల్సిందే. అందులో ఏ కాస్త ఆలస్యం జరిగినా ఆయన సహించేవారుకాదు. చేతిలో ఏదుంటే అదే నా మీదికి విసిరికొట్టి వచ్చినవాళ్ళకు కూడా వినిపించేటంత గట్టిగా కేకలేసి నానా రభసా చేసేవారు. ఆయన స్నానానికి వస్తున్నారంటే పెద్ద గంగాళంనిండా వేణ్ణీళ్ళు సిద్ధంగా ఉండాలి. ఆ ఇత్తడి గంగాళంమీద ఏదైనా చిన్న మరక కనపడిందో ఇక ఆరోజు నాకు మూడిందన్నమాటే ! తళతళా తోమి అద్దంలా ఉంచాలి. ఇక భోజనం సంగతి. ఆయన ఒక్కరూ ఎప్పుడూ భోజనం చేసి ఎరుగరు. తనకు అటూ ఇటూ ఎవరైనా కూర్చుంటేగానీ ఆయన డైనింగ్ టేబుల్ దగ్గరికి వచ్చేవారుకాదు. అసలు ఆ పూట భోజనానికి ఎంతమంది ఉంటారో తీరా వడ్డించే సమయందాకా ఎవరికీ తెలీదు. అప్పుడు కూడా ప్లేటునిండా పదార్థాలు వడ్డించాలి. ఇంతయినా ఆ ఇంటి ఇల్లాలు మొహం ముడుచుకో కూడదు. నవ్వుతూ కనిపించాలి. చూశావా ఎలా



ఉందో ? పోనీ ఇంతచేసినా ఓ చల్లని మాటైనా ఉందా ! ఉహుఁ... అది మాత్రం అడక్కు.

"మరి అలాంటి మనిషితో దాంపత్య జీవితం ఎలా వెంగ బెట్టావ్ ?" అని నువ్వు అడుగుతావని నాకు తెలుసు. అదీచెబుతాను విను. మా దాంపత్య జీవితం ఓ యాంత్రికమైన దినచర్యగా సాగిపోయింది అంతె. అందులో ప్రేమానురాగాలుగానీ, మధురానుభూతులుగానీ ఎప్పుడూ చోటు చేసుకోలేదు. ఆయన ఏ అర్ధరాత్రో, అపరాత్రో తనరాతపని ముగించి పడకగదిలోకి వచ్చేవారు. అప్పటికి పనిపాటలతో అలిసిసొలిసిన నేను మంచినిద్రలో ఉండే దాన్ని. ఆకలిగొన్న మనిషి అన్నంమీదికి ఎగబడేలా ఆయన నా మీదికి ఎగబడేవారు. పోనీ అప్పుడైనా సున్నితంగా స్పృశించి, ప్రేమతో పలకరించి నన్ను నిద్రలేపితే నాకెంత సంతోషంగా ఉండేదో ! కానీ ఆయన అలా ఎప్పుడూ చేయలేదు. మొరటుదనంలోనే ఆనందం అనుభవించేవారు. ఆకాస్త శారీరకమైన ఆకలి తీరగానే తృప్తిగా పడుకుని నిద్రపోయేవారు. అలా నిద్రమత్తులో బలవంతాన భర్తకు ఒళ్ళప్పగించడంలో ఏ భార్యకైనా ఏం సుఖం ఉంటుంది చెప్పు ? అందుకే నాకసలు దాంపత్య సుఖం అంటేనే వెగటు పుట్టుకొచ్చింది. అయితే మనసుకు ఆనందం కలగనంత మాత్రాన శరీరం ప్రకృతి సహజమైన ధర్మాన్ని వీడదుగా ? కాబట్టి నాకు ఇద్దరు పిల్లలు పుట్టారు.

నేను కన్న అందమైన కలలన్నీ కరిగిపోగా- మనసు




చంపుకుని జీవచ్ఛవంలా నేనెందుకు బతికాననుకున్నావ్ ? ఇంటి పరువు ప్రతిష్ఠలు కాపాడడంకోసం. ఆయన గౌరవాన్ని నిలబెట్టడం కోసం. అటు కన్నవారికి నావల్ల అప్రతిష్ఠ రాకుండా చూసుకోవటం కోసం. బాగుందికదూ ? మన జీవితం మనకోసంకాదు: మన చుట్టూ ఉన్నవారికోసం.

ఓ సారి ఇలాగే ఎందుకో మనసుబాగా లేదు. ఈ బతుకు మీద రోతపుట్టింది. ఈ సంసారం అంటే విరక్తి కలిగింది. ఓ నాలుగురోజులు పుట్టింటికి వెళ్ళొస్తానని చెప్పి అమ్మ దగ్గరికి పరుగెత్తాను. అమ్మతో నా బాధలన్నీ చెప్పుకుని "ఇక నేనా ఇంటికి వెళ్ళనమ్మా... ఆ మనిషితో కాపురం చేయడం నావల్లకాదు.

ఆడదంటే చులకనగా చూసేవాళ్ళతో నేను వేగలేను. నేనిక్కడే ఉండిపోతా. నా చదువు మళ్ళీ కొనసాగించి ఏదైనా ఉద్యోగం చేసుకుంటా" అన్నాను.

ఆలా అన్నానో లేదో అమ్మ పెద్ద గొడవ చేసేసింది. ఊరూ వాడా ఏకం చేసి అరుస్తూ "నువ్వసలు మతివుండే మాట్లాడుతున్నావా? పెళ్ళయిన దానివి లక్షణంగా కాపురం చేసుకోక చదివి ఉద్యోగం చేస్తావా ఉద్యోగం ? ఎవర్ని ఉద్ధరించడానికి ? ఏదో సరదాపడ్డావు కదా అని ఇంటర్‌దాకా నిన్ను చదివించడమే పెద్ద తప్పయిపోయింది. ఆ చదువును చూసుకుని ఇప్పుడు ఇంత మిడిసిపడుతున్నావన్నమాట. అయినా ఇదేం చోద్యమే. కట్టుకున్న





మొగుణ్ని గురించి ఇలా మాట్లాడ్డానికి నీకు సిగ్గులేదూ ? పైగా నువ్వే ఏరికోరి చేసుకున్న పెళ్ళాయే. ఆడపిల్లను ఓ ఇంటికి ఇచ్చారంటే ఇక అంతే. కష్టమైనా, సుఖమైనా ఆ ఇల్లే ఆమెకు సర్వస్వం నేను చేయడం లేదేమిటి మీ నాన్నతో కాపురం ? రెండో పెళ్ళని ఏనాడైనా విసుక్కోవడం నువ్వు చూశావా ? ఆయన అంత వయసు మళ్ళినవారని తెలిసి కూడా నోరుమూసుకుని పెళ్ళి చేసుకో లేదూ ? "ఆ కాలం వేరు" అంటావేమో ! ఇంతకీ ఇప్పుడు నీకొచ్చిన లోటేమిటీ అంట ? అంత గొప్ప పేరున్న మొగుడు, చక్కని పిల్లలు, మంచి మనసున్న అత్తామామలు....ముచ్చటైన కుంటుంబంమీది. పోనీ నీ ప్రకారమే చూసినా- నువ్వు భర్తను వదిలేసి ఇక్కడికొచ్చి ఉంటావనుకో. అప్పుడు నలుగురూ ఏమంటారు ? మేము వీధిలో తలెత్తుకు తిరగ్గలమా ? నీ చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళవుతాయా ? అని నన్ను పట్టుకుని దులిపేసింది.

సొంత తల్లే కూతురికష్టం అర్థంచేసుకోనప్పుడు ఇకనేనెవరితో చెప్పుకోను చెప్పు ? "ఎవరి దయాదాక్షిణ్యాలూ నాకక్కర్లేదు నేనే స్వతంత్రంగా జీవించగలను" అని అందర్నీ ఎదిరించి విడిగా ఉందామంటే అంత ధైర్యం నాలోలేదు. నా చదువు అందుకు సరిపోదుకూడా. ఎన్నోసార్లు నా నిస్సహాయత నన్ను పెరట్లోని నూతిదగ్గరికి నడిపించింది. కానీ నా ఇద్దరు పిల్లల పసిమొహాలు నీళ్ళల్లో కనిపించినట్టయి మళ్ళీ వెనక్కు వచ్చేసే దాన్ని "ఏమైనా సరే....ఇకనుంచి ఇలా పిరికిగా ఎప్పుడూ ప్రవర్తించను. నాపిల్లల

కున్నాను.

పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయితే నాకష్టాలు గట్టెక్కుతాయి. వాళ్ళయినా నా మనసును అర్థం చేసుకుని మసులుకుంటారు అన్న ఆశతో రోజులు గడపగలిగాను....గడపడమేమిటి, బలవంతాన రోజులను నెట్టుకొచ్చాననుకో. కానీ అప్పుడూ నా ఆశఫలించలేదు. వాళ్ళ చదువులు, వాళ్ళ ఆటపాటలు, వాళ్ళ గొడవలు తప్ప వాళ్ళకింకేమీ అక్కర్లేకపోయింది. పెద్దవాళ్ళవు తున్నకొద్దీ వాళ్ళల్లో స్వతంత్ర భావాలు బాగాచోటుచేసుకుని తండ్రినే ఎదిరించే టంతటి వాళ్ళయ్యారు. "వాళ్ళల్లా కావడానికి నువ్వేకారణం" అని ఆయన నామీద విరుచుకుపడడం ప్రారంభించారు. అదేదో సామెత చెప్పినట్టు పిల్లలు పెద్దవాళ్ళయితే నాకష్టాలు గట్టెక్కేమాట అటుంచి ఓ కొత్త కష్టంవచ్చిపడింది. "కరవమంటే కప్పకుకోపం- విడవ మంటే పాముకు కోపం" అన్నట్టుగా అయింది నా పరిస్థితి. అబ్బాయి రము తండ్రిని మాటవరసకైనా సంప్రదించకుండా ఓ అమ్మాయిని పెళ్ళాడి వెంటబెట్టుకొచ్చాడు ఇంటికి. ఆరోజు ఇంట్లో ఓ పెద్దరాద్ధాంతమే జరిగిందనుకో. కానీ కొన్నాళ్ళకు అన్నీ సర్దుకుని ఆ అమ్మాయి అందే నాకోడలు మా ఇంటివాళ్ళతో కలిసి పోయింది. ఇక నా కూతురు రేవతి సంగతి. కాస్త కలిగిన సంబంధం చూసి బాగానే పెళ్ళిచేశాం. కాని ఆ వియ్యాలవారిది మరీ ఆశపోతుగుణం. ఎంత పెట్టినా ఇంకా ఏదో పెట్టలేదనే సాధింపు ఎప్పుడూ. ఈ విషయం ఆయన కెంతమాత్రం నచ్చలేదు. "పిల్లను మీ చేతుల్లో పెట్టాం. ఇక ఏం పెట్టినా పెట్టకపోయినా అంతా మీదే




బాధ్యత," అని ఓ ఉత్తరం ముక్కరాసి చేతులు దులిపేసు కున్నారు. ఆడపిల్లని కిన్నవాళ్ళం మరీ అంత దురుసుగా ఉంటే ఎలా చెప్పు ? నా మాటకు ఈ ఇంట్లో గడ్డిపోచంత విలువలేదని తెలిసినా మనసు ఉండబట్టలేక ఆయనకు ఎంతో నచ్చజెప్పిచూశాను "ఈ ఇచ్చిపుచ్చుకునే గొడవలో అమ్మాయి మనసు నొచ్చుకునేలా చేయకండి!" అని, కానీ ఆయన వింటేనా ? "నువ్వు నాకు నీతులు నేర్పేటంతటిదానివయ్యావన్నమాట!" అని ఎగిరెగిరి పడ్డారు. తనను ఏవేవో అనరాని మాటలు చెప్పి అవమానంచేసినట్టు పీలవుతూ ఇల్లంతా చిందులుతొక్కారు. దాంతో నేను నోరు మూసుకోక తప్పలేదు. అయినా నా ఇష్టప్రకారం ఎప్పుడు ఏది


జరిగింది గనుక ? దెబ్బతిన్న మనసుతో అలిసిన శరీరంతో యీర్ష్యలేక యీడుస్తున్న నా ఈ కాపురమే చూసేవాళ్ళ కళ్ళకు ఎంతో ముచ్చటైన సంసారం !


నాకు చివరగా మిగిలిన తృప్తి ఏమిటంటే అంత పట్టుదల, అంతకోపం, అంత కఠినమైన మనసుగల ఆ మనిషి- అంటే నా భర్త– ఏ జబ్బుతోనూ మంచంమీద పడకుండా చప్పున హార్ట్ ఎటాక్‌తో కళ్ళుమూయడం. ఇది చదివి నువ్వు నన్ను తిట్టుకుంటావేమో ! ఏ ఆడదీ తన భర్త గురించి ఇంత దారుణంగా ఆలోచించదుకదా ? కానీ ఏం చేయనుచెప్పు? జీవితమంతా ఆయన చేత బాధపడీ పడీ నా మనసు మొద్దుబారిపోయింది. ఆడదానికి తన భర్తపట్ల సహజంగా ఉండే ప్రేమానురాగాలుకానీ, భక్తి, గౌరవాలు కానీ నాలోలేవు. ఆ భావాలన్నీ ఏనాడో చచ్చిపోయాయి.

అందుకే కాబోలు ఆయన పోగానే అన్నాళ్ళూ నేను గడిపిన ఖైదుజీవితం ముగిసినట్టూ, మనసుకు ఏదో స్వాతంత్ర్యం లభించినట్టూ అనిపించసాగింది. పసుపు కుంకుమలు పోగొట్టుకున్నందుకు ఓ వైపుబాధగా ఉన్నా– మరోవైపు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకునే అవకాశం లభించినందుకు ఆనందంగానూ అనిపించింది.

జీవితంలో ఎప్పుడూ తీరని కొన్ని చిన్నచిన్న కోరికలూ, సరదాలూ నాలో ఇంకా మిగిలివున్నాయి. అవేమిటంటావా ? ఆకాశాన్నంటే అలలతో ఉవ్వెత్తున లేచిపడే సముద్రాన్ని చూస్తూ ఒడ్డున ఉన్న ఇసుకలో నన్నునేను మరిచిపోయి కూర్చోవడం ; ఏ బాదరబందీ లేకుండా నాకు ఇష్టమైన పుస్తకాలు చదువుకుంటూ గదిలో ఒంటరిగా కాలం గడపడం, వంటింట్లో పొద్దస్తమానం ఇక మగ్గనలసిన అవసరం లేదు కాబట్టి నా కోడలు ఏది వండి పెట్టితే అది తిని హాయిగా కాలక్షేపం చేయడం: ఆ..... ఇంకో ముఖ్యమైన కోరిక ఏమిటంటే నేను తల్చుకున్నప్పుడు తల్చుకున్న చోటికి వెళ్ళిపోవడం : నా మనసుకు నచ్చినంత కాలం అక్కడ ఉండడం. నన్ను ఎవరూ దేనికి అడ్డుచెప్పకూడదు. ఇవన్నీ తీరే కోరికలే నంటావా ? ఏమో చూడాలిమరి.

అసలిప్పుడు అన్నిటికంటే ముందు చేయవలసిన పని ఒకటుంది. అదేమిటో తెలుసా ? నాలాగే "అత్తవారిల్లు" అనే బందిఖానాలో మగ్గుతున్న నా కూతుర్ని అక్కణ్ణుంచి విడిపిం






చదం. "ఇంట్లో నిన్ను ఎవరేమన్నా ఖాతరు చేయకు. నీ భర్త ఒక్కడూ నిన్ను ప్రేమగా చూస్తేదాలు. ఒకవేళ అతనికి వాళ్ళ పెద్దవాళ్ళల్లాగా ఒళ్ళువిచ్చి ఉంటే నువ్విక ఒక్క-క్షణం కూడా అక్కడ వద్దు. నీ జీవితాంతం అణిగిమణిగి పడివుండవలసిన కర్మ నీకెంతమాత్రం లేదు. వెంటనే బయల్దేరి వచ్చేసేయ్. మా అమ్మ నన్ను అన్నట్టుగా నేను నిన్ను అనను. నా కళ్ళల్లో పెట్టుకుని కాపాడతాను. నిన్ను పై చదువులు చదివిస్తాను. నువ్వు నీ కాళ్ళ మీద నిలబడేలా నా శాయశక్తులా ప్రయత్నిస్తాను" అని నిన్ననే దానికి ఉత్తరం రాశాను.

నిజమే నాలాగా నా కూతురు కూడా బానిస బతుక్కి అంకితమయిపోకూడదని నా ఉద్దేశం. ఇది నాతోనే అంతమైపోవాలి. నా కూతురు నలుగురిలోనూ ధైర్యంగా తలెత్తుకు తిరగ్గలగాలి. నాలాంటి తల్లి తనకున్నందుకు ఎంతో గర్వించాలి. అప్పుడు నా జన్మకు కొంచెమైనా సార్థకత లభిస్తుంది.

ఏమంటావ్ రాధా....?

ఇప్పటికే చాలా రాసేశాను కదూ? ఇక చాలిస్తాను. మనం కలుసుకున్నప్పుడు ఎలాగా మనసు విప్పి మాట్లాడుకుంటాం కదా? అయినా అంతవరకూ ఆగని నా మనోవ్యథను ఈ విధంగా ఉత్తరంలో వెళ్ళబోసుకుని నా మనసును తేలికపర్చుకుంటున్నాను. నీకు చాలా అనుకూలుడైన భర్త లభించాడు. మీ కాపురం కలకాలం సుఖంగా సాగిపోవాలనే నా కోరిక. క్రితంసారి నువ్వు మా ఇంటికి వచ్చినప్పుడు నాదీ నీలాగే సుఖసంసారం అని భావించావు కదూ? నా అదృష్టాన్ని పొగిడావు కూడా కానీ అప్పుడు మా అత్తగారూ, ఆడబడుచూ పక్కనే ఉండడంతో నేను నోరు విప్పి ఏమీ చెప్పలేకపోయాను. ఇన్నాళ్ళుగా నా మనసులో పేరుకున్న భావాలన్నీ ఇప్పుడు కాగితం మీదికెక్కాయనుకో!

కానీ రాధా ఒకమాట.

ఇదంతా చదివి నువ్వుమాత్రం మనసు కష్టపెట్టుకోకు సుమా! అంతా వెంటనే మరిచిపో. ఎందుకంటే నా జీవితచరిత్రలో ఆ అధ్యాయం ముగిసిపోయింది. ఇక కొత్త అధ్యాయం ప్రారంభం కావలసివుంది. జవాబు రాస్తావుకదూ? ఉంటాను.

ఇట్లు
సి శకుంతల